## కాకతీయ కాలువకు లీకేజ్ వాటర్ విడుదల చేయాలి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



భీమ్ గల్, బతుకమ్మ బాల్కొండ నియోజకవర్గ కాకతీయ కాలువ వెంబడి ఉన్న గ్రామాల రైతులు పసుపు పంట సాగుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ (ఎస్సారెస్పీ ) నుండి కాకతీయ కాలువకు వెంటనే లీకేజ్ నీటిని విడుదల చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బతుకమ్మతో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఏడాది పొడవునా కాకతీయ కాలువలో నీరు నిల్వ ఉండేదని, దీంతో రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగు చేసుకునేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం కాలువలో పూర్తిగా నీరు లేక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని అన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ లో ప్రస్తుతం తగినంత నీటి నిల్వలు ఉన్నందున, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని లీకేజీ వాటర్ ద్వారా కాకతీయ కాలువకు నీటిని విడుదల చేసి రైతులకు సాగునీరు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పసుపు పంట సాగుకు ఇది కీలక సమయమని, ప్రభుత్వం, సాగునీటి శాఖ అధికారులు వెంటనే స్పందించి లీకేజ్ వాటర్ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రేవంత్ ప్రభుత్వం

### తొలి విడతగా రూ. 2,000 కోట్ల బకాయిలు విడుదల

హైదరబాద్, బతుకమ్మ :రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని తెలంగాణ ప్రభుత్వం మరోసారి నిరూపించుకుంది. ఉద్యోగులకు ఇచ్చిన హామీని కేవలం మాటలకే పరిమితం చేయకుండా, చేతల్లో చూపించింది. ఉద్యోగుల సుదీర్ఘకాల బకాయిలను కేవలం 100 రోజుల్లో రూ. 6,000 కోట్లు విడుదల చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు ఉద్యోగ జేఏసీ నాయకులకు స్పష్టమైన హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ హామీని నెరవేర్చే దిశగా ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం తొలి విడతగా రూ. 2,000 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈరోజు విడుదల చేసిన నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలకమైన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. రిటైర్డ్ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిల మొత్తాన్ని వంద శాతం క్లియర్ చేశారు. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి మే 2025 వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ పూర్తిగా చెల్లించారు. "ముందస్తు ప్రణాళికలు, పక్కా కార్యాచరణతోనే ఇది సాధ్యమైంది. ఇచ్చిన మాట ప్రకారం మిగిలిన రూ. 4,000 కోట్ల బకాయిలను కూడా నిర్ణీత గడువులోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి ప్రభుత్వం శరవేగంగా కసరత్తు చేస్తోంది." ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చూపుతున్న ఈ శ్రద్ధ, శరవేగ నిర్ణయాలపై ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నారు.

## కాక్రోచ్ జనతా పార్టీని సోషల్ మీడియాలో ఎలా బ్యాన్ చేశారు

### కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు నోటీసు




వెబ్ డెస్క్, బతుకమ్మ :దేశంలో జన్ జి ద్వారా ప్రకంపనలు సృష్టించిన కాక్రోచ్ జనతా పార్టీని సోషల్ మీడియాలో బ్యాన్ చేయడాన్ని దాని అధినేత అభిజిత్ దీప్కే ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ నెలలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి నిరుద్యోగులను, విలేకరులను, సహ చట్టం కార్యకర్తలను బొద్దింకలుగా సంభోదిస్తూ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పుట్టుకొచ్చిన విషయం తెల్సిందే. దేశంలోని జాతీయ పార్టీలను మూడు రోజుల్లోనే అధిగమించి మిలియన్ ఫాలోవర్లను సీజేపీ అందుకున్న విషయం విధితమే. దానితో సీజేపీని కేంద్రం బ్యాన్ చేసింది. దానిని సవాల్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఢిల్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. సీజేపీ పిటిషన్ ను స్వీకరించిన ఢిల్లీ హైకోర్టు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఐటీ చట్టం ప్రకారం ఏర్పాటయిన రివ్యూ కమిటీ ముందుకెళ్లాలని అభిజిత్ కు హైకోర్టు సూచించింది.

## కాంగ్రెస్ అగ్రనేతలను కలిసిన మాజీ సీఎం సిద్ధరామయ్య



వెబ్ డెస్క్, బతుకమ్మ :కర్ణాటక సీఎంగా రాజీనామా చేసిన సిద్ధరామయ్య శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలతో సమావేశమయ్యారు. టెన్ జన్ పథ్‌లో కాంగ్రెస్ లోక్ సభ పక్షనేత రాహుల్‌గాంధీని కలిశారు. అనంతరం ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో సిద్ధరామయ్య భేటీ అయ్యారు.



# రైతు డిస్కం ప్రతిపాదనపై బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం

### ఉచిత విద్యుత్‌ను రద్దు చేసేందుకే కాంగ్రెస్ కుట్ర: జగదీశ్ రెడ్డి



హైదరాబాద్, బతుకమ్మ :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రత్యేక "రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (రైతు డిస్కం)"పై భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రైతులకు ప్రస్తుతం అందుతున్న 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాను క్రమంగా ఎత్తివేసి, విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రతిపాదన తీసుకొచ్చిందని బీఆర్ఎస్ ఆరోపించింది.

ఈ మేరకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ఈ ఆర్ సీ ) నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పార్టీ తరపున పాల్గొని తమ వాదనలు వినిపించారు. ప్రజా విచారణ అనంతరం మీడియాతో మాట్లాడిన మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి, రైతు డిస్కం పేరుతో ఏర్పాటు చేస్తున్న సంస్థ రైతుల ప్రయోజనాల కోసం కాదని విమర్శించారు. ఇది రైతులను చీకట్లలోకి నెట్టే "ఉరి డిస్కం"గా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రైతులకు, గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు నాణ్యమైన 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందించామని గుర్తు చేశారు. 2017లో ప్రారంభించిన రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని ఐదేళ్లపాటు ఎటువంటి అంతరాయం లేకుండా అమలు చేశామని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొస్తున్న మూడో డిస్కం వెనుక అసలు ఉద్దేశ్యం ఆదాయం వచ్చే వినియోగదారులను ఒకవైపు, సబ్సిడీ పొందే రైతు కనెక్షన్లను మరోవైపు వేరు చేసి, భవిష్యత్తులో ప్రైవేటీకరణకు మార్గం సుగమం చేయడమేనని ఆరోపించారు. ఇది విద్యుత్ వ్యవస్థను విభజించి రైతులను ఒంటరిగా చేసే ప్రమాదకర చర్య అని పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో నిర్మాణాత్మక మార్పులు చేపట్టాలంటే ఈ ఆర్ సీ అనుమతి తప్పనిసరి అని గుర్తు చేసిన జగదీశ్ రెడ్డి, ఈ ఆర్ సీ అనుమతి రాకముందే ముఖ్యమంత్రి మూడో డిస్కం ప్రారంభ తేదీ ప్రకటించడం నియంత్రణ సంస్థల అధికారాలను అవమానించడమేనని విమర్శించారు.

ప్రభుత్వం చెబుతున్న కారణాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని, రైతుల పేరుతో విద్యుత్ చౌర్యాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించడం రైతాంగాన్ని దొంగలుగా చిత్రీకరించే ప్రయత్నమని మండిపడ్డారు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రైతులపై మోపిన ముద్రను ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పునరావృతం చేస్తోందని ఆరోపించారు. ఈ కొత్త వ్యవస్థ అమలైతే ప్రస్తుతం రైతులకు అందుతున్న విద్యుత్ సేవలు తీవ్రంగా దెబ్బతింటాయని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. లైన్మెన్లు, ఫీల్డ్ సిబ్బంది సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని, ఒక మండలానికి ఒకరు లేదా ఇద్దరు మాత్రమే లైన్మెన్లు ఉండే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. వేలాది వ్యవసాయ కనెక్షన్లు, వందలాది ట్రాన్స్‌ఫార్మర్ల బాధ్యత కొద్ది మంది సిబ్బందిపైనే పడుతుందని తెలిపారు.

అలాగే ప్రస్తుతం ఉన్నట్లుగా సబ్‌స్టేషన్ల వద్ద అధికారులను నేరుగా సంప్రదించే అవకాశం రైతులకు ఉండదని, విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. మూడో డిస్కం ప్రతిపాదన రైతుల ప్రయోజనాలకు పూర్తిగా వ్యతిరేకమని, తెలంగాణ రైతాంగ భవిష్యత్తుకు ముప్పుగా మారుతుందని జగదీశ్ రెడ్డి హెచ్చరించారు. ఈ ప్రతిపాదనను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, తమ అభ్యంతరాలను రాతపూర్వకంగా ఈ ఆర్ సీ కి సమర్పించినట్లు వెల్లడించారు. రైతాంగం అప్రమత్తంగా ఉండి ఈ చర్యలపై పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## అక్రమ ఔట్సోర్సింగ్ నియామకాలపై ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను కలిసిన ఎంజీయూ విద్యార్థి నాయకులు







హైదరాబాద్, బతుకమ్మ :మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఇటీవల చేపట్టిన ఔట్సోర్సింగ్ నియామకాలలో అక్రమాలు, అవినీతి జరిగాయని ఆరోపిస్తూ ఎంజీయూ విద్యార్థి సంఘ నాయకులు తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ జిట్టా బాలకృష్ణ రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ వి యూనివర్సిటీ అధ్యక్షుడు వాడపల్లి నవీన్ మాట్లాడుతూ, యూనివర్సిటీలో నిర్వహించిన ఔట్సోర్సింగ్ నియామకాలు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని ఆరోపించారు. రోస్టర్ రిజర్వేషన్ విధానాన్ని పాటించకుండా, సరైన విధంగా పత్రిక ప్రకటనలు ఇవ్వకుండా, అర్హులైన నిరుద్యోగులకు అవకాశం లేకుండా నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ అంశంపై ఇప్పటికే యూనివర్సిటీ వైస్ చాన్సలర్ మరియు రిజిస్ట్రార్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా అధికారులు స్పందించలేదని తెలిపారు. దీంతో పూర్తి వివరాలతో ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. గతంలో నవీన్ మిట్టల్ వైస్ చాన్సలర్‌గా ఉన్న సమయంలో కూడా 33 మంది డైలీ వేజ్ ఉద్యోగులను రోస్టర్ రిజర్వేషన్, పత్రిక ప్రకటనలు లేకుండా నియమించారని వాడపల్లి నవీన్ ఆరోపించారు. ప్రస్తుతం జరిగిన నియామకాలలో కూడా నిరుద్యోగుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసి 100కు పైగా అక్రమ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడిన ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఆ ఏజెన్సీకి యూనివర్సిటీ లేదా ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనులు ఇవ్వకుండా బ్లాక్‌లిస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుతం జరిగిన నియామకాలను పూర్తిగా రద్దు చేసి, తిరిగి పారదర్శకంగా నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ జిట్టా బాలకృష్ణ రెడ్డి విద్యార్థుల ఫిర్యాదులను స్వీకరించి, ఈ అంశంపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకునేలా యూనివర్సిటీ అధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు విద్యార్థి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పోలగోని శివ, రాజేష్, యశ్వంత్, రామ్, జితేందర్, సంజీవ్‌తో పాటు నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

# పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీని పటిష్టం చేయాలి

### తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్ కుమార్

### విజయవంతంగా ముగిసిన బీజేపీ రెండ్రోజుల శిక్షణ తరగతులు







నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఎన్నికల్లో గెలవాలంటే పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయడమే ఏకైక మార్గమని తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్ కుమార్ స్పష్టం చేశారు. భారతీయ జనతా పార్టీ ఇందూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ముఖ్య కార్యకర్తల శిక్షణ తరగతులు అత్యంత ఉత్సాహభరితంగా ముగిశాయి. పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపిన ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి అధ్యక్షతన విజయవంతంగా జరిగింది. మొదటి రోజు ఈ శిక్షణ తరగతులను నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలను, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ గల సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పాల్గొని అంశాన్ని తీసుకొని పార్టీ భవిష్యత్ గురించి సలహాలు సూచనలు చేశారు. రెండవ రోజు శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్ కుమార్ పాటిల్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. వారు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ భవిష్యత్ కార్యాచరణపై పలు కీలక సూచనలు చేశారు. ప్రతీ బూత్ కమిటీని క్రియాశీలం చేసి, ఓటర్లతో మమేకం కావాలని సూచించారు. ఈ శిక్షణ తరగతులు కేవలం పార్టీని బలోపేతం చేయడానికి మాత్రమే పరిమితం కాదని, కార్యకర్తలలో క్రమశిక్షణను, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడానికి ఉద్దేశించినవని ఉద్ఘాటించారు. "వ్యక్తుల కన్నా పార్టీ మిన్న, పార్టీ కన్నా దేశం మిన్న" అనే సిద్ధాంతాన్ని గుర్తుచేస్తూ.. కార్యకర్తలు ఎల్లప్పుడూ దేశ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాషాయ జెండా ఎగురవేయడమే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని, ఆ దిశగా క్షేత్రస్థాయి నుంచి ప్రతి కార్యకర్త అలుపెరగకుండా శ్రమించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పసుపు బోర్డు జాతీయ చైర్మన్ పల్లె గంగారెడ్డి, స్రవంతి రెడ్డి, మోడపాటి ప్రకాష్ రెడ్డి, మోహన్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, భరత్ రెడ్డి, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులకు తదితరులు పాల్గొన్నారు.